క్లుప్తంగా

నాడు - నేడు పనుల పరిశీలన



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న అధికారులు

కుక్కునూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు అభివృద్ధి పనులను జీసీడీఓ సబిహా సుల్తానా, సెక్టోరియల్ అధికారి వి.రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పది పాఠశాలల పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించిన అధికారులు ఐదు రోజుల్లోపు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంఈవో గిరి భగవాన్‌దాస్ అధ్యక్షతన నాడు - నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పట్ల అలసత్వం వహించొద్దని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమేష్, రాధా, ముత్తమ్మ, మల్లప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మురళి మృతి తీరని లోటు



ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్ బాబును పరామర్శిస్తున్న నేతలు

లింగపాలెం: ములగలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఇనుగంటి మురళి (79) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు మురళి తనయుడు ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబును సోమవారం పార్టీ నేతలు పరామర్శించి సానుభూతి తెలియజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్, నాయకులు బీవీఎస్ రెడ్డి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, నాయకులు ఏపూరి సూరిబాబు, ఇనుగంటి సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, బి ప్రభాకరెడ్డి, జి సత్యన్నారాయణ రెడ్డి రాజేష్‌బాబును పరామర్శించారు. మురళి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ



గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు సోమవారం డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.ఎస్తేరు రాణి మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉండడం వలన సుఖ ప్రసవాలకు వీలవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 50 మంది గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ బొమ్మ మోహన్, సెక్రెటరీ సిద్ధార్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంటి, రిటైర్డ్ ఇరిగేషన్ డీఈ వెంకటాచలం, సంస్థ వైస్ ప్రెసిడెంట్ బవిరిశెట్టి నాగేశ్వరరావు, నిడదవోలు రామారావు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, బి.సుబ్రహ్మణ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ వద్ద గట్టి బందోబస్తు



వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులను పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

చింతలపూడి: స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె అద్దయ్య ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులను సోమవారం డీఎస్పీ యు రవిచంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఎన్నికల సంఘం పంపించనున్నట్లు తెలిపారు. వాటిని భద్రపరచడానికి టెంపరరీ స్ట్రాంగ్ రూమ్ కోసం మార్కెట్ కమిటీ గోడౌన్ -1ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఓటింగ్ యంత్రాలను పరిశీలించిన తరువాత పోలింగ్ కేంద్రాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ సుధాకర్, ఎస్సైలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌పై అవగాహన

ద్వారకాతిరుమల: సీ విజిల్ యాప్ వినియోగంపై స్థానిక ఉపాధి కూలీలకు కళాకారులు సోమవారం అవగాహన కల్పించారు. ఓటర్లను ఆకర్షించే విధంగా డబ్బులు, మద్యం, బహుమతులు పంచి పెడుతున్నా, ఓటర్లను ఆకట్టుకునేలా కార్యకలాపాలు జరుపుతున్నా ఫొటో గాని, వీడియో గాని తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలా చేసిన 100 నిమిషాల లోపు సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటారన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారన్నారు.

రెండోసారి సీఎంగా వైఎస్ జగన్ ఖాయం

- వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి
- వేదాంతపురం, మంగపతిదేవిపేటలో ఎన్నికల ప్రచారం



వేదాంతపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే బాలరాజు



లాండ్రీ షాపు వద్ద ఇస్త్రీ చేస్తున్న రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: మరో రెండు నెలల్లో రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మన జగనన్నను చూడబోతున్నామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వేదాంతపురం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బాలరాజు, నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాధరావులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను పొందిన ప్రజల ఓటు కోసం వాళ్ల ఇంటి ముందుకు వెళుతుంటే వారిఇంటి ఆడపడుచుగా తనను ఆహ్వానిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సంగ్రామంలో నైతిక విలువలతో జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడే ఒకవైపు, తోడేళ్ల మంద, నక్కల మందలు మరోవైపు నిలిచాయని ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కూరగాయల కోస్తూ, వారి పసిపాపలను ఎత్తుకొని లాలిస్తూ, ఆడబిడ్డలను, అన్నదమ్ములను, అవ్వ తాతలను పలకరిస్తూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాల్సిందిగా అభ్యర్థించారు.

చేతివృత్తులవారిని ఆదుకునేది వైఎస్సార్ సీపీనే..

సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత ఖాయమో, జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం కూడా అంతే ఖాయమని ఎమ్మెల్యే బాలరాజు పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత ఏర్పడబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెల్లం రాజ్యలక్ష్మిని మంత్రిగా చూడబోతున్నాం అని ఏఎంసీ మాజీ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాధరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనేకమంది వైఎస్సార్ పెన్షన్‌దారులు తమకు పింఛన్ అందలేదని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం గడువు పొడిగించిందని పార్టీ శ్రేణులకు వారికి పెన్షన్ అందించే విధంగా కృషి చేయాలని ఆదేశించి సచివాలయాలకు పంపి పింఛన్ సొమ్ములను ఇప్పించడం జరిగింది. చేతి వృత్తుల వారికి చేయూత పథకంతో వారు కులవృత్తులు చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసిందని చెబుతూ రాజ్యలక్ష్మి లాండ్రీ షాపులో ఇస్త్రీ చేసి మహిళల్లో స్ఫూర్తి నింపారు.

బాలరాజు దంపతులకు బ్రహ్మరథం

మంగపతిదేవిపేట గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గడప గడపకు తిరిగి బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పెద్దల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఓట్లు అడిగి ధైర్యం, నిజాయితీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మాత్రమే ఉందని ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్‌కు, ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మికి ఓట్లు వేసి గెలిపించాలని బాలరాజు నేతృత్వాన్న విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దాసరి శ్రీలక్ష్మి, గంజిమాల రామారావు, తుమ్మలపల్లి గంగరాజు, గొడ్డటి నాగేశ్వరరావు, గంజి ధనకోటిరెడ్డి, తేలే శ్రీనివాస్, పాల కన్నయ్య, కూనపోము శ్రీను, మాదాపు శివయ్య, పట్టపు దావీదు, పట్టపు శేఖర్, ముల్లంగి వరదారెడ్డి, మాదేపల్లి వెంకటాచారి, కలపాల శ్రీను, యడ్లపల్లి రాజు, చిడిపి రవి, జక్కు గోపాలం, చిడిపి రమణ, చిడిపి వెంకటరమణ, చిక్కాల మణికంత గంగుల సీతయ్య, నున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో ఈదురుగాలులు



విద్యుత్ తీగలపై పడిన భారీ రావిచెట్టు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో వీచిన ఈదురుగాలుల ప్రభావంతో స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద గల రావి వృక్షం విరిగి పడి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖాధికారులు చెట్టును తొలగించి, విద్యుత్ వైర్లకు మరమ్మతులు నిర్వహించి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా



పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి రాజీనామా పత్రం అందజేస్తున్న నరెడ్ల సుజాత

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తాల పంచాయతీలో ప్రజలకు సేవలందిస్తున్న ఏడుగురు వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. వలంటీర్లు కొత్తపల్లి రత్నకిషోర్, నరెడ్ల సుజాత, వల్లిబోయిన స్వాతి, దాసరి స్వాతి నేరుగా తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు. అలాగే అందుబాటులో లేని కారణంగా కొవ్వలి ఇందిర, చిగురుపాటి సారిక, కొత్తపల్లి రాజేష్ తమ రాజీనామా పత్రాలను వారి కుటుంబ సభ్యుల ద్వారా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామాలు చేసిన వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేస్తూ, వారికి సేవలందిస్తున్న వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చుతున్న టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి తాము జగనన్న సైనికుల్లా మారుతామని స్పష్టం చేశారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



మసీదులో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

లింగపాలెం: రంజాన్ మాసంను పురస్కరించుకుని సోమవారం ధర్మాజీగూడెం మసీదులో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఫిత్రా దానముల ద్వారా వసూలు చేసిన రూ.20 వేలతో సుమారు 100 మంది పేదలకు ముస్లిం పెద్దల ద్వారా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మసీదు గౌరవ అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ, మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ గౌస్‌మోహీద్దిన్, కార్యదర్శి సయ్యద్ బాజీ, కమిటీ సభ్యులు ములాలహ్మద్, మస్తాన్ సాధిఖ్, నాగులు, పీరావలి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు పిలుపు



పార్టీ నేతలతో సమావేశమైన వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

లింగపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. లింగపాలెంలో సోమవారం పార్టీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్‌లో పార్టీ మండల నాయకులతో వారు చర్చించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ యాదవ్, విజయరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి తన పాలనలో అందించిన సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీ విజయానికి ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సంక్షేమ పథకాలు మున్ముందు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఏలూరు ఎంపీ, చింతలపూడి ఎమ్మెల్యే సీట్లను గెలిపించుకొని సీఎం జగన్‌కు కానుకగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, నాయకులు బి.ప్రభాకర రెడ్డి, రావి కొండయ్య, పానుగంటి రాము, తగరం జయరాజు తదితరులు పాల్గొన్నారు.


నూకాలమ్మకు గ్రామోత్సవం



నూకాలమ్మ తల్లికి పంచామృతాలు, పుణ్య నదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ తల్లి 60వ వార్షిక ఉగాది జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాలుగవ రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీనూకాలమ్మ తల్లికి, నర్మదా అమృత బాణ లింగేశ్వర స్వామి వార్లకు ఆలయ ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ పంచామృత, పుణ్యనదీ జలాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి హారతులు సమర్పించారు. స్వర్ణవర్ణపూర్ణ కవచాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి తాండ్రపాపారాయుడు సెంటర్ రామాలయం నుంచి ప్రత్యేక సింహవాహన రథంపై అమ్మవారి గ్రామోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, తీన్మార్ డప్పులు, గరగాటలు, విచిత్ర వేషధారణలతో నడుమ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆలయం కళ్యాణ కళావేదిక వద్ద బ్రహ్మశ్రీ గుండూరి సత్యకిరణ్ శాస్త్రి పురోహితులచే పంచాంగ శ్రవణం నిర్వహించబడునని రాజాన పండు తెలిపారు. అభినయ కూచిపూడి నాట్య అకాడమి, ఎస్.రూపాదేవి శిష్య బృందం భరత నాట్యం, జానపద నృత్య గీతాలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, అభివృద్ధి, ఉత్సవ కమిటీల సభ్యులు, శ్రీనూకాంబికా సేవా భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

‘అనన్య’ చిత్ర యూనిట్‌కు సత్కారం



జంగారెడ్డిగూడెంలో అనన్య చిత్రం యూనిట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రేక్షకులకు నచ్చిన సినిమాయే గొప్ప సినిమా అని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ (సీహెచ్‌ఆర్) అన్నారు. జంగారెడ్డిగూడెం పరిసరాల్లో నిర్మాణం జరుపుకున్న విజయవంతంగా ప్రదర్శించబడుతున్న అనన్య చిత్ర యూనిట్‌కు సోమవారం రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్‌ఆర్ కృష్ణబాబు ఆధ్వర్యంలో అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రంలో నటించిన పలువురు నటీనటుల సాంకేతిక నిపుణులను ఇతర విభాగాలవారిని జానపద కళాకారుల సంఘం తరఫున దుశ్శాలువాతో సత్కరించారు. మెమెంటోలు అందజేశారు. దర్శక నిర్మాతలు బి.ప్రసాదరాజు, జంధ్యాల గంగాధరశర్మ, బుద్దాల సత్యనారాయణ స్థానికంగా సినిమా నిర్మాణ సమయంలో తమకు ఎదురైన అనుభవాలు వివరించారు. తమ రెండో చిత్రాన్ని ఇక్కడే మొదలు పెడుతున్నట్టు డైరెక్టర్ ప్రసాదరాజు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్మాత, దర్శకులని, హీరో వెంకట్, విలన్‌గా నటించిన రాజేష్, ఇతర పాత్రధారులు దుర్గాప్రసాద్, రాజేశ్వరి, కుమారి, పీఆర్‌ఓ కెఎస్ శంకరరావు, పాటల రచయిత నవీన్ విల్లూరి, అసిస్టెంట్ డైరెక్టర్ అఖిల్‌లను ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎస్ఆర్ మూవీ క్రియేషన్స్ అధినేత సింగంశెట్టి సత్యరాజ్, వైఎస్సార్ సీపీ పట్టణం అధ్యక్షుడు చిటికిన అచ్చిరాజు, కేఎల్ఎన్ ధన కుమార్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ స్వర్ణకారుల సంఘ అధ్యక్షుడు ఎల్.భోగేశ్వరరావు ఆధ్వర్యంలో డైరెక్టర్ ప్రసాద రాజును సన్మానించారు.

ముత్యాలమ్మ ఆలయంలో మహాపూర్ణాహుతి



జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ ఆలయ చతుర్ధ వార్షి ౹ వేడుకల్లో భాగంగా సోమవారం మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ , పద్మ కుమారి దంపతుల పర్యవేక్షణలో అర్చకులు మిర్తిపాటి విశ్వనాథ్ శ్రీనివాస్, ఆర్యవైశ్య అర్చకులు బొడ్డు సత్యనారాయణ గుప్తా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నవ వర్ణాలతో అభిషేకం, కుంకుమార్చన శ్రీదేవి ఖడ్గమాలార్చన, అర్గళాస్తోత్ర పూర్వక చండీ మూలమంత్రహోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉగాది సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం మహా అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని మురళీకృష్ణ తెలిపారు.

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ



అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసిఉన్న శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత విజయదుర్గ అమ్మవారి ఆలయం నందు మాసశివరాత్రి పురస్కరించుకొని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ కమిటీ పల్లకీ సేవ నిర్వహించింది. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిసెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ శాశ్వత, అభివృద్ధి, ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు

ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ



కేఆర్‌పురం ఐటీడీఏలో తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ, పోలవరం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో సోమవారం నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన తహసీల్దార్‌లతో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఏర్పాటు చేసిన ఎస్‌సీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు మరింత చురుగ్గా పని చేయాలని అన్నారు. అదేవిధంగా సీ-విజిల్ ద్వారా సమస్యలను తెలుసుకునేందుకు ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే వాటిలో వచ్చిన సమస్యలు కూడా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మద్యం, నగదు వంటి రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన నిఘా బృందాలు మరింత పటిష్టంగా పనిచేయాలని సూచించారు. అలాగే కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ప్రకారం ఈ నెల 18వ తేదీన నామినేషన్ ప్రక్రియను కేఆర్‌పురం ఐటీడీఏలో నిర్వహిస్తామని చెప్పారు. అలాగే 25వ తేదీ వరకూ నామినేషన్‌లు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. 26వ తేదీన నామినేషన్‌ల పరిశీలన, 29వ తేదీన ఉపసంహరణలతోపాటు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పారు.

పలు గ్రామాల్లో ఎస్ఈబీ దాడులు



నాటుసారా తయారీకి వినియోగిస్తున్న వస్తువులను స్వాధీనం చేసుకున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ డీఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఎస్ఈబీ అడిషనల్ సూపరింటెండెంట్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గణపతిబాబు ఆధ్వర్యంలో చింతలపూడి ఎస్ఈబీ, ఏలూరు డీఎఫ్‌టీ బృందం దాడులు నిర్వహించినట్లు చెప్పారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం, లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి, లింగపాలెం, టి.నరసాపురం మండలం కృష్ణాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి 60 లీటర్ల నాటు సారా సీజ్ చేసి, 3800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఎన్నికల దృష్ట్యా మద్యం అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన లంకాలపల్లి చెక్‌పోస్టును సందర్శించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఏలూరు డీఎఫ్‌టీ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌వీఎస్ నరసింహారావు, చింతలపూడి ఎస్ఈబీ ఎస్సై ఆర్.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే బాలరాజు హాజరు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ముస్లిం సోదరులు

కొయ్యలగూడెం: రంజాన్ నెల రోజుల ఉపవాస దీక్షలతో ప్రతి ముస్లిం అల్లా కృపకు పాత్రుడు కాగలడని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం జామియా మసీదులో సోమవారం మైనారిటీ సెల్ నాయకులు ఎస్కే బాజీ, ఎస్కే పఠాన్ రియాజ్ ఖాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఇమామ్, మత పెద్దలతో కలిసి లోక కళ్యాణార్థం దువా ఆచరించారు. ఎస్కే రంజాన్, జహంగీర్ భాషా, అలీం, అతిరాస రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, మంతెన సోమరాజు, దాసరి విష్ణు, మట్టా శ్రీను, గంటా శ్రీను, ఘంటసాల సాయి, జి.మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

ద్వారకాతిరుమల: సూరప్పగూడెం రైల్వే వంతెన వద్ద ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ద్వారకాతిరుమలకు చెందిన యన్నంశెట్టి గణేష్ (22) నరసాపురంలోని స్వర్ణాంధ్రా కళాశాలలో బీటెక్ (సీఎస్ఈ) తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉగాది పండుగకు ఇంటికొచ్చిన గణేష్ ఆదివారం ఏలూరులోని తన స్నేహితులను కలిసి వస్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం ఘటనాస్థలం వద్ద పట్టాలు దాటుతున్న గణేష్‌ను ఒక రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

21 నుంచి విర్డ్‌లో స్పెషల్ క్యాంప్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 21 నుంచి 24 వరకు స్పెషల్ ఆర్థోపెడిక్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్టు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అమెరికాకు చెందిన వైద్యుడు కామినేని శ్రీనాథ్ ద్వారా ఈ చారిటబుల్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. అమెరికా, భారతదేశంలోని ప్రముఖ వైద్యులు ఈ క్యాంప్‌లో రోగులకు సేవలందిస్తారని తెలిపారు. వివరాలకు 83744 45108, 7901695176 నంబర్లకు సంప్రదించాలని కోరారు.